క్లుప్తంగా

ఆర్బీకేల్లోనే కంది కొనుగోలు కేంద్రాలు

ముప్పాళ్ళ: మండలంలోని అన్ని గ్రామాల్లో రైతు భరోసా కేంద్రాలు కంది కొనుగోలు కేంద్రాలుగా పనిచేస్తాయని, రైతులు తమ కంది పంట ఉత్పత్తులను గ్రామంలోనే అమ్ముకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఎం.అరుణ బుధవారం చెప్పారు. అమ్ముకోదలచిన రైతులు తప్పనిసరిగా పంట నమోదు చేసుకొని ఉండాలన్నారు. ప్రతి రోజు మార్కెట్‌లో ఉన్న ధర ప్రకారమే ఆర్బీకేల్లో కొనుగోలు చేస్తారని, ఎటువంటి ఆందోళన అవసరం లేదన్నారు. రైతులు సంబంధిత ఆర్బీకేలోని వ్యవసాయశాఖ సిబ్బందిని సంప్రదించి పేరు నమోదు చేసుకోవాలని కోరారు.

నేడు 500 బైకులతో ర్యాలీ

సత్తెనపల్లి: నియోజకవర్గంలో సత్తెనపల్లి రూరల్ మండలంలోని కీలకమైన 10 గ్రామాలను గురువారం ద్విచక్ర వాహనాలతో చుట్టి వచ్చేలా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు ప్రణాళిక సిద్ధం చేశారు. తద్వారా గ్రామాలలో స్థానిక అంశాలపై చర్చించడం, రానున్న ఎన్నికలకు సన్నద్ధం చేయడం, మండలంలోని వైఎస్సార్‌సీపీ నేతల్లో ఎన్నికల జోష్‌ను నింపడమే లక్ష్యంగా ఆయన సాగుతున్నారు. ఉదయం 6.30 గంటలకు సత్తెనపల్లి నుంచి బయలుదేరి రామకృష్ణాపురం, నందిగం, గుడిపూడి, లక్ష్మీపురం, ఫణిదం, భట్లూరు, కట్టమూరు, దీపాలదిన్నెపాలెం, అబ్బూరు, గండ్లూరు గ్రామాలలో ద్విచక్ర వాహన ర్యాలీగా పర్యటన జరగనుంది.

నేడు ఆత్మీయ సమావేశం

అచ్చంపేట: స్థానిక ఎమ్మెల్యే నంబూరు శంకరరావు, నరసరావుపేట వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్ నేడు అచ్చంపేట మండలంలో పర్యటించనున్నారు. ఉదయం 11 గంటలకు మాదిపాడు పంచాయతీ పరిధిలోని స్వయంభు సత్తెమ్మతల్లిని దర్శించుకుంటారు. నియోజకవర్గ స్థాయి పార్టీ నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తారు. అనంతరం చల్లగరిగ, తాడువాయి, పుట్లగూడెం, చింతపల్లి, చెరుకుంపాలెం, కొత్తపల్లి గ్రామాలలో కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహిస్తారు. కొత్తపల్లిలో టీటీడీ నిధులతో శ్రీకృష్ణ దేవాలయానికి శంకుస్థాపన చేస్తారు. చెరుకుంపాలెంలో గ్రామ ప్రారంభంలో నిర్మించిన స్వాగత ద్వారాన్ని ప్రారంభిస్తారు. సాయంత్రం 6 గంటలకు అచ్చంపేట పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో మాట్లాడతారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావలసిందిగా మండల పార్టీ కన్వీనర్ చిల్కా చంద్రయ్య కోరారు.

ముగిసిన వైద్య శిబిరం

దొడ్లేరు(క్రోసూరు): గత కొద్దిరోజులుగా గాదెవారిపాలెం, గరికపాడు గ్రామాల్లో ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారని వచ్చిన వార్తలపై వెంటనే స్పందించిన ప్రభుత్వ వైద్య అధికారులు, సిబ్బంది రెండురోజులుగా నిర్వహించిన వైద్య శిబిరాలు బుధవారంతో ముగిసినట్లు దొడ్లేరు సెక్టార్ పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ మహమ్మద్ సాద్ తెలిపారు. గాదెవారిపాలెంలో నిర్వహించిన వైద్య శిబిరంలో జ్వరాల రోగులు ఎవరూ రాలేదని, కేవలం బీపీ, షుగర్, ఒళ్లు, కీళ్ల నొప్పుల రోగులు మాత్రమే వచ్చినట్లు తెలిపారు. వారందరికీ వైద్య పరీక్షలు చేసి మందులు అందజేసినట్లు తెలిపారు. వైద్య శిబిరంలో ఎంఎల్‌హెచ్‌పీ దివ్య బాలజ్యోతి, ఏఎన్‌ఎం ఝన్సీరాణి రోగులకు పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. డాక్టర్ సాద్ వైద్యశిబిరాన్ని పర్యవేక్షించారు.

హక్కులకై బహిరంగ వేలం

బెల్లంకొండ: మండలంలోని బెల్లంకొండ క్రాస్ రోడ్డు వద్ద గల కోళ్లూరు ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద పూజాద్రవ్యాల విక్రయ హక్కులకై బుధవారం దేవదాయశాఖాధికారులు బహిరంగ వేలం నిర్వహించారు. కొమ్మరికాయలు, పూజా ద్రవ్యాలు విక్రయాలకై బి.వెంకటేశ్వరరెడ్డి రూ.7,56,000, కొబ్బరిచిప్పల సేకరణకై రూ.1.02 లక్షలు, చిత్రపటాలు, బొమ్మలు వగైరా విక్రయాలకై గుడిశా నాగిరెడ్డి రూ.4,22,000, క్యాంటీన్ నిర్వహణకు రూ.1,02,000, లడ్డూ ప్రసాదాల విక్రయాలకు ఆర్.శివప్రసాద్ రూ.47,500లకు హక్కులు పొందారు. మొత్తం బహిరంగ వేలం ద్వారా ఆలయానికి రూ.14,29,500 ఆదాయం రానున్నట్లు ఈవో అవుదూరి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవదాయ ఇన్‌స్పెక్టర్ వేమగిరి లీలావతి, జూనియర్ అసిస్టెంట్ జాలయ్య పాల్గొన్నారు.

శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

చాగంటివారిపాలెం(ముప్పాళ్ళ): మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలోని జగన్నాథ స్వామి దేవాలయంలో శంకర్ నేత్రాలయం, పెదకాకాని ఆధ్వర్యంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరంలో వైద్యులు హర్షిత పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించారు. 50 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో 20 మందికి కంటి శస్త్ర చికిత్సలు అవసరమున్నట్లుగా గుర్తించారు. సిబ్బంది రాజ్యలక్ష్మీ, లక్ష్మీపూజిత, రమ్యలు వైద్య సేవలందించారు. కార్యక్రమంలో జగన్నాథస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరంగారెడ్డి,పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

88త్యాళ్లూరు(క్రోసూరు): మండలంలోని 88త్యాళ్లూరు జెడ్పీ పాఠశాలకు ఉపాధ్యాయుడు, అచ్చంపేట స్నేహహస్తాలు ఫౌండేషన్ సంయుక్తంగా రూ.20 వేలు ఖరీదు చేసే ప్రింటర్‌ను బహూకరించినట్లు హెచ్‌ఎం లక్ష్మీనారాయణ బుధవారం తెలిపారు. సర్పంచ్ గంగయ్య చేతుల మీదగా ప్రింటర్‌ను అందజేశారు. గణిత ఉపాధ్యాయుడు పసుమర్తి పద్దయ్య రూ.10 వేలు, అచ్చంపేట స్నేహహస్తాలు ఫౌండేషన్ రూ.10 వేలతో ప్రింటర్‌ను అందజేసినట్లు తెలిపారు.

కొమెరపూడి.. అభివృద్ధికి గుడి

- గత టీడీపీ ప్రభుత్వంలో అటకెక్కిన అభివృద్ధి
- నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మారిన కొమెరపూడి గ్రామ రూపురేఖలు
- రూ.37.45 కోట్లు ప్రత్యక్షంగా, పరోక్షంగా లబ్ధి
- రూ.12.82 కోట్లతో అభివృద్ధి

నాటి టీడీపీ ప్రభుత్వంలో సత్తెనపల్లి మండలంలోని కొమెరపూడి గ్రామం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేది. జన్మభూమి కమిటీ నాయకుల చేతుల్లో ప్రజలు కష్టాలు అనుభవించేవారు. రేషన్ కార్డు, సంక్షేమ పథకం లబ్ధి పొందాలన్నా అల్లాడిపోయిన ప్రజలు నేటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అన్ని సంక్షేమ పథకాల లబ్ధిని ఇంటి వద్దే అందుకుంటున్నారు. గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ నూతన భవనాలు వెలిశాయి.

సత్తెనపల్లి: సత్తెనపల్లి మండలం కొమెరపూడి సచివాలయ పరిధిలో 1,538 కుటుంబాలకు గాను 5,957 మంది జనాభా ఉన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఈ కొమెరపూడి పంచాయతీని పూర్తిగా విస్మరించింది. రోడ్లు, వీధిలైట్లు, కాలువలు, మంచినీళ్లు లేక గ్రామస్తులు తీవ్ర అవస్థలకు గురయ్యారు. జన్మభూమి కమిటీల దయా దాక్షిణ్యాలపై ఆధారపడాల్సిన పరిస్థితి. 2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చారు. దీంతో కొమెరపూడి గ్రామంలో రూ.12.82 కోట్ల అభివృద్ధి పనులు జరిగాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా రూ.37.45 కోట్ల లబ్ధి ప్రజలకు చేకూరింది. మొత్తం జనాభా 5,957 కాగా ఓటర్లు 5,230 మంది ఉన్నారు. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు చొరవతో ప్రభుత్వ భవనాలు చురుగ్గా నిర్మించారు. జరిగిన అభివృద్ధి, అందిస్తున్న సంక్షేమ పథకాల పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

గ్రామంలో అభివృద్ధి పనులు..

- రూ.40 లక్షలతో సచివాలయ భవనం.
- రూ. 21.80 లక్షలతో రైతు భరోసా కేంద్రం.
- రూ.21.80 లక్షలతో వైఎస్సార్ విలేజ్ క్లినిక్.
- రూ.13.75 లక్షలతో ప్రభుత్వ భవనాల కోసం 25 సెంట్ల స్థలం కొనుగోలు.
- నాడు–నేడు ఫేజ్–1లో రూ.24 లక్షలతో 3 పాఠశాలల అభివృద్ధి.
- రూ.60 లక్షల ఆర్‌ఎంఎస్ నిధులతో జెడ్పీహెచ్ పాఠశాల నిర్మాణం.
- రూ.1.69 కోట్లతో సిమెంట్ రోడ్లు, కాలవలు.
- రూ.14 లక్షలతో కల్వర్టుల నిర్మాణం.
- రూ.34 లక్షలతో కంటెపూడి–లింగంగుంట్ల మేజర్ వరకు 2.75 కిలోమీటర్ల రహదారి.
- రూ.10 లక్షల మైనింగ్ గ్రాంట్‌తో మెటల్ రోడ్డు.
- రూ.28 లక్షలతో గ్రావెల్ రోడ్ల నిర్మాణం.
- రూ.45 లక్షలు సీఎస్ఆర్ ఫండ్స్‌తో కమ్యూనిటీ హాల్ నిర్మాణం.
- రూ.5 లక్షలతో ముస్లిం బరియల్ గ్రౌండ్‌లో సీసీ రోడ్లు.
- రూ.10 లక్షలతో గ్రామంలో 8 బోర్లు.
- రూ.12 లక్షలతో ప్రభుత్వ భవనాల చుట్టూ ప్రహరీ.
- రూ.7.50 లక్షలతో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్ద వాచ్ మెన్ రూమ్, లెవలింగ్, నాడెప్‌తొట్లు నిర్మాణం.
- రూ. 1.60 లక్షలతో మంచినీటి చెరువు చుట్టూ జంగిల్ క్లియరెన్స్.
- రూ.8 లక్షలతో ఎస్సీ కాలనీలో చర్చి ప్రహరీ, కళావేదిక నిర్మాణం.
- రూ.2 లక్షలతో ఎస్సీ కాలనీలో కమ్యూనిటీ హాల్ స్థలం లెవలింగ్.
- రూ.3 కోట్లతో 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు.
- రూ.60 లక్షల ఖర్చుతో 24 గంటలు త్రీ ఫేజ్ సరఫరా.
- రూ.1.80 కోట్లతో ఇంటింటికీ రక్షిత మంచినీటి సరఫరా పనులు జరుగుతున్నాయి.
- రూ.2 కోట్లతో కొమెరపూడి–యర్రగుంట్ల పాడు బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన.
- రూ.15 లక్షలతో బీసీ కాలనీలోని రజకవాడ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి శంకుస్థాపన.


నిర్మాణంలో ఉన్న కమ్యూనిటీ హాల్


నిర్మాణంలో ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంక్


సచివాలయ భవనం


రైతు భరోసా కేంద్రం


విలేజ్ హెల్త్ క్లినిక్


33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్

మంత్రి అంబటి సహకారంతో అభివృద్ధి..



రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు సహకారంతో గ్రామంలో దాదాపు రూ.13 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టగలిగాం. గ్రామంలో సమస్యల పరిష్కారానికి ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయించుకుని అభివృద్ధి పనులు చేపట్టాం. ప్రభుత్వ భవనాలను నిర్మించాం. ప్రభుత్వ పథకాలు నేరుగా లబ్ధిదారులకు అందుతుండడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–కళ్ళం విజయభాస్కర్‌రెడ్డి, వ్యవసాయ సలహా సంఘం సభ్యుడు, కొమెరపూడి

ప్రజల చెంతకే పాలన..



మా గ్రామంలో గాంధీజీ కల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో సాకారం అవుతుంది. సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్, తదితర కార్యాలయాల భవనాలు నిర్మించడంతోపాటు సిబ్బందినీ ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ప్రతి సంక్షేమ పథకం ప్రజల ఇంటి వద్దకే చేరుస్తున్నారు. గ్రామంలో ఎక్కడ చూసినా సీసీ రోడ్లు కనిపిస్తున్నాయి. గ్రామాన్ని ఇంత అభివృద్ధి చేసిన మంత్రి అంబటి రాంబాబుకు కృతజ్ఞతలు.

–సంకటి నాగేశ్వరమ్మ, జెడ్పీటీసీ, కొమెరపూడి

సచివాలయ వ్యవస్థ గొప్ప ఆలోచన..



సచివాలయ వ్యవస్థ తీసుకురావడం ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి వచ్చిన గొప్ప ఆలోచన. అలాగే వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే సేవలందించిన ప్రభుత్వాలను నేనెప్పుడూ చూడలేదు. మా గ్రామంలోని అన్ని వర్గాల వారికి అన్ని సంక్షేమ పథకాలు అందుతున్నాయి. మా గ్రామస్తులంతా సంతోషంగా ఉన్నారు. మంత్రి అంబటి రాంబాబు సహకారం మరువలేనిది.

–ఎలవర్తిపాటి షేక్ జై బూన్‌బీ, ఎంపీపీ, కొమెరపూడి

జగనన్న అటవీహక్కుల చట్టం గిరిజనులకు వరం

ఎమ్మెల్యే నంబూరు శంకరరావు


శాశ్వత భూ హక్కు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే నంబూరు శంకరరావు

అచ్చంపేట: జగనన్న అటవీహక్కుల చట్టం గిరిజన రైతులకు ఒక అద్భుతమైన వరం అని ఎమ్మెల్యే నంబూరు శంకరరావు అన్నారు. మండలంలోని నీలేశ్వరపాలెం గ్రామానికి చెందిన ఏడుగురు గిరిజన రైతులు ఎన్నో ఏళ్లుగా 6.17 ఎకరాల అటవీ భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వారందరికీ బుధవారం క్రోసూరు పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే శాశ్వత భూ హక్కు కల్పిస్తూ పట్టాలను పంపిణీ చేసి మాట్లాడారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ఇందిర ప్రభ పథకం ద్వారా వేల ఎకరాల భూములను ఎస్సీ, ఎస్టీ రైతులకు పంపిణీ చేశారన్నారు. అలాగే ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గిరిజన రైతులకు అండగా ఉంటూ వారు సాగుచేసుకుంటున్న భూములపై శాశ్వత హక్కులు కల్పించి వారి జీవితాలలో వెలుగులు నింపుతున్నారన్నారు. మండలంలో కొండూరు, తాడువాయి, నీలేశ్వరపాలెం గ్రామాలలో అటవీ భూములు సాగుచేసుకుంటున్న గిరిజన రైతులందరికీ పట్టాలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఇకపై హక్కు పత్రాలతో బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చని, ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని పథకాలను పొందేందుకు అర్హత ఉంటుందని చెప్పారు. రైతులంతా ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకుని ఆదాయ వనరులను మెరుగు పరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ అధికారి ఏసురత్నం, ఫారెస్ట్ సిబ్బంది వైఎస్సార్‌సీపీ గ్రామ పార్టీ నాయకులు పానకాల నీలయ్య, వీరబాబు, వీఆర్వో బాలూనాయక్ పాల్గొన్నారు.

పల్స్ పోలియో అమలు తీరు పరిశీలన

క్రోసూరు: ఈనెల 3న జరిగిన పల్స్ పోలియో కార్యక్రమం అమలు తీరును ప్రపంచ ఆరోగ్య సంస్థ బృంద సభ్యులు డాక్టర్ కోటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా క్రోసూరులోని ఎస్సీ కాలనీలో ఇళ్లను సందర్శించారు. ఐదేళ్లలోపు పిల్లలకు చుక్కల మందులు వేశారా, లేదా అని తల్లులను అడిగి తెలుసుకున్నారు. చుక్కల మందు వేసేందుకు ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వచ్చారా అని అడిగారు. గృహాలపై మార్కింగ్ వేస్తున్నది లేనిది పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పోలియో చుక్కలు వేసిన చిన్నారుల ఎడమ చేతి చిటికెన వేలికి మార్కింగ్ ఉందా లేదా అని పరిశీలించారు. ఆయన వెంట ఆరోగ్య విస్తరణాధికారి శిఖా శాంసన్, హెల్త్ సూపర్‌వైజర్లు శివుడు, ప్రభావతి, ఆరోగ్య, ఆశ, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమర్థంగా ఎన్నికల విధులు నిర్వహించాలి

సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి మురళీకృష్ణ


మాట్లాడుతున్న మురళీకృష్ణ

సత్తెనపల్లి: ఎన్నికల విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి, నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో బుధవారం సార్వత్రిక ఎన్నికలు–2024కు సంబంధించి సత్తెనపల్లి నియోజకవర్గంలోని సూపర్‌వైజర్లు, బూత్‌లెవల్ అధికారులకు నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికల విధుల్లో నిర్లక్ష్యంగా ఉండకూడదని స్పష్టం చేశారు. ముఖ్యంగా క్లైమ్‌లు, అభ్యంతరాలను పరిశీలించి ఓటరు జాబితా సవరణలను పారదర్శకంగా చేపట్టాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు కల్పించి ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మాక్ పోలింగ్ ఏ విధంగా నిర్వహించాలో, సమస్యలు వస్తే ఎలా స్పందించాలో సిబ్బందికి వివరించారు. ఎన్నికలను విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అసెంబ్లీ లెవల్ మాస్టర్ ట్రైనర్లు 10 మంది శిక్షణ ఇచ్చారు. శిక్షణ తరగతుల్లో మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి, ఏఈఆర్వోలు, తహసీల్దార్లు సీహెచ్ ఉష, పీ సింగారావు, ఎం.హరిబాబు, ఎల్.లక్ష్మీనారాయణ, 24 మంది సూపర్‌వైజర్లు, 274 మంది బీఎల్వోలు పాల్గొన్నారు.

మోదీ రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య

సత్తెనపల్లి: ఢిల్లీ రైతు ఉద్యమంలో ప్రధాని నరేంద్ర మోదీ రైతులకు రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈనెల 14న ఢిల్లీలో జరిగే బహిరంగ సభను రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వి.కృష్ణయ్య పిలుపునిచ్చారు. సత్తెనపల్లిలోని పుతుంబాక భవన్‌లో బుధవారం రైతు సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు గుంటుపల్లి బాలకృష్ణ అధ్యక్షతన జరిగిన రైతు సంఘం పల్నాడు జిల్లా కమిటీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 2021లో ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమం సందర్భంగా మోదీ రైతులకు ఇచ్చిన రాతపూర్వక హామీలను అమలు చేయాలని కోరుతూ ఈ నెల 14న ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని సంయుక్త కిసాన్ మోర్చా నిర్ణయించినట్లు తెలిపారు. అందులో భాగంగానే మండల, జిల్లా కేంద్రాలలో జరిగే నిరసన కార్యక్రమాల్లో రైతులు, కూలీలు, కార్మికులంతా పాల్గొనాలని, ఈనెల 14న చలో ఢిల్లీకి తరలివెళ్లాలని పిలుపునిచ్చారు. చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో రైతు సంఘం రాష్ట్ర నాయకులు గద్దె చలమయ్య, పల్నాడు జిల్లా కార్యదర్శి ఏవీఎన్ గోపాలరావు, రైతు సంఘం నాయకులు ఎం.నరసింహారావు, ఎ.ఆంజనేయులు, కె.రామారావు, బి.నాగేశ్వరరావు, ఎం.నాగేశ్వరరావు, జి.జాలయ్య పాల్గొన్నారు.

సురక్ష వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోండి



నకరికల్లు: గ్రామ సచివాలయం స్థాయిలో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో డి.జయమణి అన్నారు. మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం బుధవారం నిర్వహించారు. గ్రామంలోని ప్రజలు పెద్దసంఖ్యలో శిబిరానికి హాజరై బీపీ, షుగర్, సీజనల్ వ్యాధులకు వైద్యపరీక్షలు చేయించుకున్నారు. ఈ సందర్భంగా వైద్యపరీక్షలు నిర్వహించిన నకరికల్లు పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ బి.మణికంఠ మాట్లాడుతూ శిబిరంలో 434 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రజమంలో ఎంపీటీసీ సభ్యుడు రేమిడిచర్ల కాశీ, డాక్టర్ హర్ష, డాక్టర్ శ్రావణి, గ్రామ పెద్దలు, ఏఎన్‌ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైద్య శిబిరంలో 285 మందికి పరీక్షలు

రాజుపాలెం: మండలంలోని గణపవరం గ్రామ సచివాలయం–2 పరిధిలో జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ముగ్గురు స్పెషలిస్ట్ డాక్టర్లు రాజమోహన్‌రెడ్డి, సందీపనిక, రవితేజనాయక్‌లు 285 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. కంటి వైద్యులు సత్యనారాయణ 88 మందికి కంటి పరీక్షలు నిర్వహించి కళ్లజోళ్లు ఉచితంగా ఇచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. సచివాలయ సిబ్బంది, మిడ్‌లెవల్ హెల్త్ ప్రొవైడర్ శిరీషబాయి, అలేఖ్య, ఏఎన్‌ఎం ధనలక్ష్మీ, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గురువు, చర్మకారుడు సంత్ రవిదాసుకు నివాళులు




క్రోసూరు: ఆధ్యాత్మిక గురువు, చర్మకారుడు సంత్ రవిదాస్ జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ చర్మకారుల సేవా సంఘం నియోజకవర్గ కన్వీనర్ భాస్కరరావు ఆధ్వర్యంలో స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బాబు జగజ్జీవన్ రామ్ విగ్రహాల సెంటర్ వద్ద సంత్ రవిదాస్ చిత్రపటానికి బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా చర్మకారుల సేవా సంఘం రాష్ట్ర కార్యదర్శి, ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు గార్లపాటి దాసు మాట్లాడుతూ సంత్ రవిదాస్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సిద్ గోవర్ధనపూర్ గ్రామంలో 1376 మార్చి 6న చెప్పులు కుట్టే చమర్(చర్మకార్) కులంలో జన్మించాడన్నారు. సంత్ రవిదాస్ చిన్ననాటి నుంచే చర్మకార వృత్తిని నిర్వహిస్తూ మరో పక్క ఆధ్యాత్మిక భక్తి, దైవచింతన రచనలు చేస్తూ గురువుగా మార్గదర్శకునిగా బోధనలు చేసేవాడన్నారు. సమాజంలో అందరూ సమానమే. బ్రాహ్మణులైనా, చర్మకారులైనా, క్షత్రియులైనా, వైశ్యులైనా అందరూ వారి వారి కర్మల ప్రకారమే జీవిస్తారని తెలిపారన్నారు. ముందుగా సంత్ రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కంభంపాటి నాగయ్య, కిన్నెర వెంకటేశ్వర్లు, పెద్దింటి డేవిడ్, బోరుగడ్డ కోటేశ్వరరావు, చిలకా వసంతరావు పాల్గొన్నారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై సమీక్ష


సమావేశంలో మాట్లాడుతున్న ఏఆర్వో అజయ్‌కుమార్

పెదకూరపాడు: సార్వత్రిక ఎన్నికలకు అందరూ సిద్ధంగా ఉండాలని, గ్రామాల్లో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించే బాధ్యత సెక్టార్ ఆఫీసర్లు, పోలీసు సిబ్బందిదే అని పెదకూరపాడు నియోజకవర్గ ఏఆర్వో తోట అజయ్‌కుమార్ అన్నారు. పెదకూరపాడు ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో నియోజకవర్గంలోని 27 మంది సెక్టార్ ఆఫీసర్లు, పోలీసు సిబ్బందితో సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ ఒకొరికొకరు సమన్వయం, సహకారంతో ఎన్నికల విధులు నిర్వహిస్తే విజయవంతం చేస్తామన్నారు. గత ఎన్నికల్లో ఆయా గ్రామాల్లో, పోలింగ్ కేంద్రాల్లో జరిగిన హింస, ఓటు వేయకుండా అడ్డుకునే పరిస్థితులు, ప్రలోభాలకు గురైన విధానాలపై నివేదిక ఇవ్వాలన్నారు. ముందుగా సమస్యాత్మక గ్రామాలపై అవగాహన ఉంటే బందోబస్తు పెంచవచ్చన్నారు. ఈ సమావేశంలో అన్ని మండలాల తహసీల్దార్లు పాల్గొన్నారు.

రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా మంగిశెట్టి ప్రమాణస్వీకారం


కోటేశ్వరరావును అభినందిస్తున్న ఎమ్మెల్యే నంబూరు

అమరావతి: మండలంలో సీనియర్ నాయకుడు, పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీకి సేవలు అందించిన మంగిశెట్టి కోటేశ్వరరావు బుధవారం రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రమాణస్వీకారం చేశారు. తాడేపల్లిలోని రాష్ట్ర కాపు కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన ప్రమాణస్వీకార కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు మంగిశెట్టి కోటేశ్వరరావుచేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ క్రమంలో పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కోటేశ్వరరావును అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నంబూరు శంకరరావు నూతన కాపు కార్పొరేషన్ డైరక్టర్ కోటేశ్వరరావును సత్కరించి అభినందించారు. ఎమ్మెల్యే శంకరరావు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడిగా, పార్టీ జిల్లా కార్యదర్శిగా మంగిశెట్టి అమూల్యమైన సేవలు అందించారన్నారు. మంగిశెట్టి కోటేశ్వరరావు మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావంలో ఎంతో కష్టనష్టాలను చవిచూసామన్నారు. నేడు తనను గుర్తించి ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి, ఎమ్మెల్యే నంబూరు శంకరరావు రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నానన్నారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ విజయానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మేకల హనుమంతరావు, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు భవిరిశెట్టి హనుమంతరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షుడు మంగిశెట్టి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు నంబూరు బాబురావు, నందూరి కరుణకుమార్, పలుకూరి రోశిబాబు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.

నేడు దేవస్థానం ముఖ మండపం ప్రారంభం

రాజుపాలెం: మండలంలోని దేవరంపాడు కొండపై వెంచేసి ఉన్న నేతి వెంకన్న స్వామి వారి దేవస్థానంలో నూతనంగా నిర్మించిన ముఖ మండపం గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తు, కొండపైకి మెట్ల మార్గాన్ని నేడు రాష్ట్ర జలవనరుల శాఖామాత్యులు అంబటి రాంబాబు సాయంత్రం 3 గంటలకు ప్రారంభించనున్నట్లు దేవదాయ శాఖ ఈవో గుర్రం శ్రీనివాసరెడ్డి, దేవస్థానం కమిటీ చైర్మన్ శ్యామకూరి శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. కావున ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

నేడు గుండ్లపల్లిలో సచివాలయం, ఆర్బీకే ప్రారంభం

నకరికల్లు: మండలంలోని గుండ్లపల్లి గ్రామంలో సచివాలయం, ఆర్బీకే, విలేజ్ క్లినిక్‌లను గురువారం ప్రారంభించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి బుధవారం తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు, నరసరావుపేట పార్లమెంట్ ఎంపీ అభ్యర్థి అనిల్‌కుమార్‌యాదవ్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి హాజరవుతారని తెలిపారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని సూచించారు.